క్లుప్తంగా

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పనికి తగ్గ వేతనం వచ్చేలా చూడాలని ఎంపీడీఓ జేవీ ఝాన్సీ సూచించారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఫీల్డ్ అసిస్టెంట్లకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో గుర్తించిన పనులను చేపట్టాలని, జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. పని చేసే ప్రదేశంలో తాగునీరు, మౌలిక వసతులు, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

చాగల్లు: స్థానిక కాకతీయ కల్యాణ మండపం సెంటర్‌లో మానవత ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ చేశారు. మానవత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో గురువారం లింగాల వెంకటశాస్త్రి జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాస శర్మ, పద్మశ్రీ దంపతులు, వారి కుటుంబ సభ్యులు అందించిన సహకారంతో మజ్జిగ వితరణ చేసినట్టు మానవత సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మానవత సభ్యులు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

నిడదవోలు: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనం ద్వారానే ఏకాగ్రత, జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవచ్చునని గ్రంథాలయాధికారి కుంచే చినబాబు అన్నారు. పట్టణంలో శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ అంశాలలో నిర్వహించిన పోటీలలోని విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులందరూ గ్రంథాలయంను సందర్శించేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని గ్రంథాలయాధికారి కుంచే చినబాబు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథ పాలకులు కుందుల ప్రభాకరం, అరుగుపల్లి రమణ, వేదుల జనార్దనరావు విద్యార్థులు పాల్గొన్నారు.

8 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

దేవరపల్లి: గౌరీపట్నంలో ఎస్ఈబీ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 8 మద్యం సీసాలతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కె.వి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై పి.సుదీర్, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న శేఖర్‌బాబు

చాగల్లు: చంద్రవరం శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా గ్రంథాలయాన్ని పరిశీలించామన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి, లైబ్రేరీ సెస్ సక్రమంగా చెల్లించేటట్లు గ్రంథాలయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అనంతరం సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులతో ముచ్చటించారు. స్టోరీ టెల్లింగ్, శతక పద్యాలు చెప్పిన చిన్నారి ఆర్.భవ్యని, ఎం.సత్యశ్రీని అభినందించారు. గ్రంథాలయానికి ప్రతి రోజు రావాలని, ప్రతి ఆదివారం జరిగే వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె.సుమన్‌కుమార్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందనలు



జేసీ తేజ్ భరత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ సమర్థవంతంగా సేవలు అందించారని కలెక్టర్ కె.మాధవీలత అభినందించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం ఆయనకు జ్ఞాపిక అందించి సత్కరించారు.

ఎంపీ అభ్యర్థికి కొవ్వూరులో అధికంగా ఓట్లు

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావుకి వచ్చిన ఓట్లు కంటే ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ అదనంగా 3,037 ఓట్లు పోలయ్యాయి. 176 పోలింగ్ కేంద్రాల్లో కొన్ని చోట్ల క్రాసింగ్ ఓటింగ్ చేయడంతో ఎమ్మెల్యే అభ్యర్థికి 33 పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే అధిక్యత లభించింది. ఎంపీ అభ్యర్థికి మాత్రం 46 పీఎస్‌ల్లో అధిక్యత లభించింది. ఎంపీ అభ్యర్థికి 61,834 ఓట్లు లభిస్తే ఎమ్మెల్యే అభ్యర్థికి మాత్రం 58,797 ఓట్లు దక్కాయి.

పలకరించిన తొలకరి

- చల్లబడిన వాతావరణం
- ముమ్మరంగా ఖరీఫ్ నారుమళ్లు
- డివిజన్‌లో 38,465 హెక్టార్లలో సాగుకి సన్నద్ధం
- ఇప్పటికే 234 హెక్టార్లలో పూర్తయిన నారుమళ్లు
- గోదావరి డెల్టా కాలువలకు నీటి విడుదల
- ఎత్తిపోతల పథకాలు, బోర్ల కింద ముమ్మరంగా వ్యవసాయ పనులు



కొవ్వూరు శివారున వేసిన వరి నారుమడి



పొలం దున్నుతున్న రైతు



యంత్రం సాయంతో దుక్కు చేస్తున్న రైతు

కొవ్వూరు: తొలకరి పలకరించింది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో వాతావరణం చల్లబడింది. వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకి సన్నద్ధమవుతున్నారు. గోదావరి పశ్చిమ డెల్టా కాలువకు సాగునీరు విడిచిపెట్టడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు నారుమళ్లు పోసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. డివిజన్‌లో 38,465 హెక్టార్లలో ఖరీఫ్‌లో వరి సాగవుతోంది. కొవ్వూరు, దేవరపల్లి, నల్లజర్ల, తాళ్లపూడి వంటి మెట్ట ప్రాంత మండలాల్లో బోర్లు, ఎత్తిపోతల పథకాల కింద నారుమళ్లు వేశారు. డివిజన్‌లో 1,982 హెక్టార్లలో నారుమళ్లు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 234 హెక్టార్లలో నారుమళ్లు వేశారు. గోపాలపురం మండలంలో మినహా అన్నీ మండలాల్లోనూ నారుమళ్ల ప్రక్రియ ప్రారంభమైంది.

రైతులకు అవగాహన

ముందస్తు ఖరీఫ్ సాగుకి అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అధికారులు ముందుస్తు కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఏడాది రుతు పవనాలు సకాలంలో రావడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. డివిజనల్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సిద్ధం చేశారు. రైతుల్ని సాగుకి సన్నద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు త్వరితగతిన పూర్తయితే మూడో పంటకి అవకాశం లభిస్తుందని సూచిస్తున్నారు. ముందస్తు సాగుతో అక్టోబర్, నవంబర్‌లలో వచ్చే తుపానుల బారిన పడకుండా పంటలు గటెక్కించే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు అధికారులు రైతుల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ ఏడాది రోహిణి కార్తెలో వర్షాలు కురవడంతో వాతావరణం పూర్తి చల్లబడింది. దీంతో రైతులు నారుమళ్లు రెడీ చేసుకునే పని పడ్డారు. మరో వారం రోజుల్లో నారుమళ్ల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. డివిజన్‌లో ఖరీఫ్ సాగులో సింహాభాగం వరి సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది ఎంటీయూ 7029(స్వర్ణ) వంగడం, పీఎల్‌పి -1100 రకం, ఎంటీయూ -1318, బీపీటీ 5204 వంగడాలతో పాటు ఎంటీయూ-1061, 1064, 1418, 1153,1156,1121 ఆర్పీ బయో(సంపత్ స్వర్ణ) తదితర రకాలు సాగు చేస్తున్నారు.

బోర్లపై అత్యధిక శాతం సాగు

డివిజన్‌లో అత్యధిక సాగుభూమి మెట్ట ప్రాంతంలోనే ఉంది. ప్రధానంగా బోర్లపై ఆధారపడి అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతం మండలాలైన దేవరపల్లి, నల్లజర్ల, చాగల్లు, తాళ్లపూడి తదితర మండలాలతో పాటు కొవ్వూరు, నిడదవోలులో కొంత ఏరియాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే బోర్ల కింద కొంత మంది రైతులు మెట్ట దమ్ము చేశారు. పెరవలి, ఉండ్రాజవరం పూర్తిగాను నిడదవోలు పాక్షికంగాను గోదావరి డెల్టా పరిధిలో ఉన్నాయి. డెల్టా కాలువల ద్వారా 10వేల హెక్టార్లు సాగవుతోంది. కాలువలకు నీరు విడిచిపెట్టడంతో డెల్టా రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

మండలాల్లో నారు వేసిన, వేయాల్సిన సాగు భూముల వివరాలు

మండలం	సాధారణ విస్తీర్ణం హెక్టార్లలో..	వేయాల్సినవి హెక్టార్లలో..	వేసినవి
చాగల్లు	3,484	174	56
దేవరపల్లి	3,718	186	25
గోపాలపురం	4,137	207	-
కొవ్వూరు	3,434	229	85
నిడదవోలు	7,235	362	20
పెరవలి	3,335	167	02
తాళ్లపూడి	3,832	192	20
ఉండ్రాజవరం	4,995	250	06
నల్లజర్ల	4,295	215	20
మొత్తం	38,465	1,982	234

ముందస్తు సాగుతో రైతుకు మేలు



ఖరీఫ్ ముందస్తు సాగుకి పక్కాగా కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగులు మందులు సిద్ధంగా ఉన్నాయి. రైతులు ముందుస్తుగా సాగు రైతుకి లాభదాయకం. రైతుల్లో అవగాహన పెంచుతున్నాం. సకాలంలో ఖరీఫ్ పూర్తి చేస్తే మూడో పంటగా అపరాలు, మినుము, పెసర, పచ్చిరొట్ట వంటి పంటలు వేసుకోవచ్చు. రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు అందిస్తున్నాం. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాం.

-పి.చంద్రశేఖర్,వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, కొవ్వూరు డివిజన్

లోకేష్‌ను కలిసిన నేతలు



అమరావతిలో లోకేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జవహర్



చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసిన కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: అన్నదేవరపేటకు చెందిన టీడీపీ నాయకులు, పారిశ్రామిక వేత్త జి వెంకటేశ్వరరావు(జీవీ) తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబును అమరావతిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కొవ్వూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన ముప్పిడి వెంకటేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు.

అమరావతిలో మాజీ మంత్రి జవహర్

కొవ్వూరు: టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి కేఎస్ జవహర్ గురువారం అమరావతిలో పార్టీ నేత నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పార్టీ ఘన విజయం సాధించడం, జిల్లాలో అన్నీ స్థానాలను కైవసం చే కోవడంపై లోకేష్‌తో ఆయన ఆనందాన్ని పంచుకున్నారు. లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి, ఆలింగనం చేసుకుని సంతోషాన్ని పంచుకున్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు: ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం అమరావతిలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసిన శాలువాతో చంద్రబాబుని సత్కరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు, నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, ముప్పిడి ధరన్ తదితరులు చంద్రబాబుని కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం పార్టీ నేత నారా లోకేష్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు.

కూటమి ప్రభుత్వంలో అందరికి మంచి జరగాలి

తాళ్లపూడి: రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకులు అల్లూరి విక్రమాదిత్య అన్నారు. మండలంలోని అన్నదేవరపేటలో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ తరపున విజయం సాధించిన కూటమి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీగా దగ్గుబాటి పురందరేశ్వరి విజయం సాధించిన సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు. గ్రామంలో నాయకులు విక్రమాదిత్యతో కలిసి విజయోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళ నాయకురాలు కప్పల ధనలక్ష్మి, నాయకులు కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

నల్లజర్లలో వైద్య ఉద్యోగుల ర్యాలీ



నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో వైద్య ఉద్యోగుల ర్యాలీ

నల్లజర్ల: మలేరియా రహిత సమాజం చేరువలో ఉందని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధర రావు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు గంగాధరరావు మాట్లాడుతూ దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు, అనర్థాలు గ్రామాలలో ప్రజలకు విస్తృత అవగాహన కల్గిస్తున్నట్టు చెప్పారు. లక్ష్యానికి చేరువలో మలేరియా రహిత సమాజం అనే నినాదంతో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు తీవ్రంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇంటి పరిసరాలలో నీటి గుంటలు లేకుండా చేయడం, పరిసరాల పరిశుభ్రతల ద్వారా ఎన్నో రకాల వ్యాధులు నివారించే అవకాశం ఉందన్నారు.

గ్రామాలలో మలేరియా నివారణ చర్యలు చేపట్టండి

మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకొని గ్రామాలలో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ నరేష్ కుమార్ సచివాలయ అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై పంచాయతీ గ్రామీణాభివృద్ధి అధికారి పీఎస్ఎస్ సింహాద్రి వైద్య ఉద్యోగులతో సమావేశమై దోమల వల్ల వచ్చే వ్యాధుల నివారణ కోసం కృషి చేయాలని పిలుపునిస్తూ ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

మలేరియా నివారణపై అవగాహన

తాళ్లపూడి: మలేరియా బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. మలకపల్లిలో గురువారం మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు దోమల నివారణ, నియంత్రణపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ప్రవీణ్ కుమార్, తేజస్విని, పూర్ణావతి తదితరులున్నారు.

ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ధర్నా

- ఏఎన్‌ఎంను సస్పెండ్ చేయాలంటూ నిరసన
- మద్దతు పలికిన రాష్ట్ర అధ్యక్షురాలి పోశమ్మ



పోతవరం పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

నల్లజర్ల: పోతవరం పీహెచ్‌సీ వద్ద ఆశ వర్కర్లు నిరసన వ్యక్తం చేస్తూ గురువారం ధర్నా, ఆందోళన చేపట్టారు. ఒక ఏఎస్ఎం ముగ్గురు ఆశ వర్కర్లను వేధింపులకు గురిచేస్తుందని ఆమెను తక్షణం విధుల నుంచి తొలగించాలని వీరంతా ఆందోళన చేస్తున్నారు. ఆశ వర్కర్ల రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ మాట్లాడుతూ పోతవరం-2 సచివాలయ పరిధిలో పని చేస్తున్న ఏఎస్ఎం రామలక్ష్మిపై ఆశవర్కర్లను వేధిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదును పురస్కరించుకొని ఆమె పనితీరుపై జిల్లా వైద్యారోగ్యశాఖాధికారికి పలుమార్లు విన్నవించామన్నారు. ఏప్రిల్ 24న ఆమెపై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సంజయ్ పోతవరం వచ్చి విచారణ చేశారని ఆ నివేదిక ఆధారంగా ఏఎస్ఎం రామలక్ష్మిని ఇక్కడ నుంచి హెడ్‌క్వార్టర్స్‌కు సరెండర్ చేశారన్నారు. ఎన్నికల కారణంగా ఆమె మళ్లీ ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్నారని ఆమె ఇక్కడ ఉన్నంతసేపు ఆశలు పనిచేయమంటున్నారని వివరించారు. చిరుద్యోగులపై ఇంత కక్ష పూరితంగా వ్యవహరించడం తగదన్నారు. ఆమె దగ్గర పని చేస్తున్న ఆశలు లక్ష్మి, ప్రమీల, దుర్గలు విధులు బహిష్కరించారన్నారు. ఆమెకు మద్దతుగా ఆపీహెచ్‌సీలో ఉన్న 41 మంది ఆశలు విధులు బహిస్కరించి ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. ఏఎస్ఎం రామలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని, ఆశ వర్కర్లకు న్యాయం చేయాలని డిమాండ్ కోరారు. ఈ విషయమై ఆసుపత్రి డ్రాయింగ్ ఆఫీసర్ డాక్టరు రాజశేఖర్‌ను వివరణ కోరగా గతంలో నాలుగైదు సార్లు ఆశలు, ఏఎస్ఎంకు గొడవులు జరిగాయని ఆ తర్వాత ఆశలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిగింది. నివేదికలో ఏఎస్ఎంను జిల్లా కేంద్రానికి సరెండర్ చేయాలని ఆదేశించారని ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ఆమె తిరిగి ఇక్కడే విధులు నిర్వరిస్తున్నారని త్వరలోనే విచారణ నివేదిక అమలు చేస్తారన్నారు. ఆశలు చేస్తున్న ధర్నా విషయం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

ఓపెన్ కరాటే పోటీల్లో క్రీడాకారుల సత్తా



ఓపెన్ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రకాశం నగర్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో రాజమహేంద్రవరం, ధవళేశ్వరానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి పలు పతకాలు సాధించారు. విక్టరీ సూటో, ఖాన్ కరాటే మాస్టర్స్ అకాడమీ ఆధ్వర్యంలో కాకినాడలో గురువారం నిర్వహించిన పోటీల్లో 8 నుంచి 18 ఏళ్ల వయసున్న బాల బాలికల విభాగంలో సీహెచ్ ప్రవళి, ఏ.పవన్, జె.నవ్య, సీహెచ్ జైదీప్, జె.శశాంత్, ఎస్.వీహస్ సూర్య, కె.జాక్సాస్, పి.పూజ, ఎస్.శ్రీలక్ష్మీలత, ఎండీ ఆయేషా, పి.శ్రీరామ్, ఏ.అభిషేక్, కె.హర్షల్, కె.జయకర్, కె.దివాకర్ బంగారు పతకాలు గెలుచుకున్నారు. జె.నక్షత్ర, ఎ.పూజ, ఎస్.శరత్, ఎస్.నిఖిలేష్, కె.లాస్య, ఎ.కీర్తన, ఎస్.నిఖిలేష్ వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్‌ను ఇండియా స్టైల్ చీఫ్ ఆర్.మల్లికార్జున్ గౌడ్ అభినందించారు.

వైభవంగా గురుచరిత్ర పారాయణ



గురుచరిత్ర పారాయణ చేస్తున్న భక్తులు

రాజానగరం: శనీశ్వరుని జయంతి, అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం గురుచరిత్ర పారాయణ చేశారు. స్థానిక సాయి భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పారాయణ మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి వచ్చిన కొందరు భక్తులు తమ చిన్నారులకు బాబా సన్నిధిలో పటిక బెల్లం తులాభారం వేసి, మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి గురువారం మాదిరిగానే మధ్యాహ్న హారతి అనంతరం జరిగిన అన్నసమారాధనలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కడియం: పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు తరపున దివంగత నర్సరీ రంగ ప్రముఖుడు పల్ల వెంకన్న కుటుంబ సభ్యులు మండలంలోని పలువురు విద్యార్థులకు గురువారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. వెంకన్న 88వ జయంతిని పురస్కరించుకుని జాతీయ రహదారి పక్కనే కడియపులంకలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ట్రస్టు తరపున విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కడియం మండలంలోని తొమ్మిది హైస్కూళ్లలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయల మేరకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేయడం అభినందించారు. అలాగే విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు బి.సుధ, కె.జయలక్ష్మి, పి.సంధ్యారాణి, వీవీ ప్రసాదరావును సత్కరించారు. ఉప విద్యాశాఖాధికారి నారాయణ, కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, మాజీ అధ్యక్షుడు పుల్లా ఆంజనేయులు, స్థానిక ప్రముఖులు మార్గాని లక్ష్మీసత్యనారాయణ, పాటంశెట్టి చక్రవర్తి, పంతం గణపతి, ఎంఈవోలు వై.నాగేశ్వరరావు, మణికుమార్ పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందుకున్నది వీరే..

పదో తరగతిలో మండల ప్రథమం సాధించిన తాండ్ర హేమ (కడియం)కు రూ.10 వేలు, టి. శ్రీసాయిశ్రావ్యకు (మురమండ) రూ.7500, భాను ప్రకాష్, దుర్గా ప్రశాంతి, దుర్గా పావని, రాధిక, స్వాతి, హర్షిత, లక్ష్మీ వర్షిణి, అనూష, జ్యోతిక, సుభాషిణి, పవిత్ర, దుర్గాభవాని, సూర్యావతిలకు రూ. 5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే వేమగిరి కొండపైగల బుద్ధ విహారాకు రూ.30 వేలు విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు. పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పల్ల సత్యనారాయణమూర్తి, సభ్యులు పల్ల సుబ్రహ్మణ్యం, గణపతి, పాఠంశెట్టి చక్రవర్తి, వెంకటేష్, వినయ్, నర్సరీ రైతులు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నడిపించిన రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, డీఈవో వాసుదేవరావులను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.